క్లుప్తంగా

8న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు వన్‌టౌన్‌: 2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500 మార్కులు కంటే ఎక్కువ సాధించిన విద్యార్థులకు జై శ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 8న ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు వి.కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్‌ కళాక్షేత్రంలో ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

తెనాలి ఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్‌: తెనాలిలో దళిత యువకులపై పోలీసుల దాష్టికం ఘటనను జాతీయ ఎస్సీ కమిషన్‌ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తెలిపారు. ఒంగోలులోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ కుట్రలతోనే దళిత యువకులపై పోలీసులు బహిరంగంగా దాడి చేశారని అన్నారు. ఈ సంఘటనను హోం మంత్రి సమర్థించడం సిగ్గుచేటన్నారు. కారంచేడు, చుండూరు ఉద్యమ బాధితులను అక్కున చేర్చుకున్న తెనాలి ఐతానగర్‌ దళితులు అన్యాయాన్ని సహించలేరన్నారు. చుట్టుపక్కల గ్రామాలలో అన్యాయానికి గురవుతున్న దళితులకు అండగా ఉంటారన్నారు. రాష్ట్రంలో తాలిబన్‌ చట్టం అమలవుతోందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, రవి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు 15 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

దొనకొండ (కురిచేడు): దొనకొండ మండలం లక్ష్మీపురం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు దర్శి సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సై వీఆర్‌ సత్యనారాయణరావు, సిబ్బంది ఖాశీంపీరా, సీహెచ్‌ సాయిబాబా, ఎన్‌.శ్రీనివాసరావులు దాడులు నిర్వహించి వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.



ముప్పాళ్ల వద్ద రెల్లకుండా వదిలేసిన బర్లీ పొగాకు చేను



కండ్లగుంట వద్ద కోత కోయకుండా వదిలేసిన మిరపతోట

రైతు కష్టం మట్టిపాలు..!

- కోత కూలికి సరిపడా ధరలు కూడా పంటలకు లేకపోవడంతో పొలాల్లోనే వదిలేస్తున్న వైనం
- కోత కోయించినా గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసే నాథుడు లేడంటూ ఆవేదన
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆందోళన



ఈదుమూడి వద్ద వదిలేసిన బర్లీ పొగాకు తాళ్లు

నాగులుప్పలపాడు: రైతులకు వ్యవసాయానికి మించిన తృప్తి మరెందులోనూ ఉండదంటే అతిశయోక్తి కాదు. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో రైతుల ఆనందానికి అవధులుండవు. చేతికొచ్చిన పంట అమ్ముకుని నగదు రూపంలో ప్రతిఫలం పొందడమనేది ప్రతి రైతుకూ ఒక కల. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ సీజన్‌ అంటేనే రైతులకు పీడకలలా ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన ఏ పంటనూ గిట్టుబాటు ధరకు కొనే నాథుడు లేక కోత కోస్తే కూలీలకు ఎలా డబ్బులివ్వాలో కూడా అర్థంగాక పంటలను చేలల్లోనే నిలువునా వదిలేసే దుస్థితికి రైతాంగం వచ్చింది. నాగులుప్పలపాడు మండలంలో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో బర్లీ పొగాకు, మిరప పంటలు సాగు చేశారు. పంటలు వేసే సమయంలో ఉన్న మార్కెట్‌ రేట్లపై ఆశతో రైతులంతా ఆయా పంటలు సాగు చేశారు. తీరా పంట చేతికందే పరిస్థితుల్లో గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారు. మిర్చి, పొగాకు పంటల సాగుకు ఎక్కువ మంది కూలీలతో పని ఉంటుంది. వీటి సాగు కోసం ఎంత ఖర్చు పెట్టాలో.. కోత కూలీలకు కూడా అంతే స్థాయిలో ఖర్చు ఉంటుంది. ఇంత చేసినప్పటికీ ఈ ఏడాది మిర్చి క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు కూడా ధర పలకకపోవడం, బర్లీ పొగాకును క్వింటా రూ.4 వేలకు కూడా కొనేవాళ్లు లేకపోవడంతో ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రేట్ల ప్రకారమయితే చేలల్లో కోత కోసి ఆరబెట్టి తొక్కి మార్కెట్‌కు తరలించాలంటే రైతు చేతికే ఇంకా డబ్బులు పడే పరిస్థితి ఉండటంతో మిర్చి, బర్లీ పొగాకులను కోత కోయించే సాహసం చేయలేక చేలల్లోనే నిలువునా వదిలేశారు. బర్లీ పొగాకు అయితే ముందు కోసిన కోతలను తాళ్లతో ఎండబెట్టి తీసి చెక్కులు తొక్కడానికి కూడా రైతులు ఇష్టపడలేదు. మద్దతు ధరలకు కొనేనాథుడు లేక తాళ్లపైనే చేలల్లో నిలువునా వదిలేశారు. ఈ ఏడాది చూసిన దారుణ పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని బర్లీ పొగాకు, మిర్చి పంటలు సాగుచేసిన రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఎన్‌ఎంఎంఎస్‌ సాధించిన గుండ్లాపల్లి విద్యార్థిని



నిహారిక

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థిని దారా నిహారిక గత సంవత్సరం నిర్వహించిన నేషనల్‌ మీన్స్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌ పరీక్షలో ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌ తెలిపారు. ప్రతి సంవత్సరం 12 వేల రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్‌ వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో నిహారికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గోనుగుంట విద్యార్థులు...

చీమకుర్తి రూరల్‌: మండలంలోని గోనుగుంట జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెడ్‌మాస్టర్‌ బండి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు ఆర్‌.వినయ్‌కుమార్‌, ఓ అలేఖ్య, టి.పవన్‌ కళ్యాణ్‌, ఈ కీర్తనలకు అభినందనలు తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్‌ వరకు ప్రతి ఏడాది 12,000 రూపాయలను ఎన్‌ఎంఎంఎస్‌ వారు అందజేస్తారని తెలిపారు. వాటిని విద్య కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 20 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమా శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురస్కారాలకు మద్దిపాడు విద్యార్థులు ఎంపిక

మద్దిపాడు: పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు ప్రకటించింది. ఈ ప్రతిభా పురస్కారాలకు మద్దిపాడు మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బసవన్నపాలెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నుంచి ఇట్లా పద్మావతి, లింగంగుంట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నుంచి చినిగే రాణి, ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, నేతాజీ స్కూల్‌ నుంచి మోరబోయిన పద్మ, నయనాల రాజ్యలక్ష్మి, పెదకొత్తపల్లి జిల్లా పరిషత్‌ పాఠశాల నుంచి కళ్లగుంట సునీత, మద్దిపాడు నారాయణ పాఠశాల నుంచి పాటిబండ్ల వైష్ణవి, కవిల నిస్సిదేదీప్యరాణిలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలు అందుకోనున్నారు. వీరికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

దొండపాడులో పోలేరమ్మకు పూజలు

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ పరిధి దొండపాడు గ్రామస్తులు గురు, శుక్రవారాల్లో పోలేరమ్మ, బొడ్డురాయికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మించారు. 40 రోజుల క్రితం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఐక్యంగా పోలేరమ్మ, బొడ్డురాయి పూజలు చేశారు. మహిళలు తలంటి స్నానాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మా గ్రామం చల్లగా చూడమ్మా, పిల్లా పాపలు సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలంటూ పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్తులు అన్నదానం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



పోలేరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

ఉయ్యాల పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు సమీపంలో వెలసిన ఉయ్యాలా పోలేరమ్మ రెండో వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా పూలమాలలు, మామిడి ఆకులతో అలంకరించారు. అర్చకులు భరద్వాజ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, నిమ్మకాయలు, తమలపాకులు, వేపాకు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఏఆర్‌ ఎస్పీ బదిలీ



ఏఆర్‌ ఎస్పీ అశోక్‌బాబు వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్‌

ఒంగోలు టౌన్‌: ఏఆర్‌ ఎస్పీ ఎంఎస్‌ఎస్‌ అశోక్‌బాబు మంగళగిరి పోలీసు ట్రాన్స్‌పోర్ట్‌ ఆర్గనైజేషన్‌ (పీటీఓ)కు బదిలీ అయ్యారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పరిపాలనా అనుభవం కలిగిన అశోక్‌బాబు తనకు ఎంతో సహకరించారని గుర్తు చేసుకున్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా, కరాటే, ధ్యానంతో పాటు పలు క్రీడలు నిర్వహించడంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఎన్నికల సమయంలో బందోబస్తు, నేర నియంత్రణలో విశేష సేవలు అందించారని చెప్పారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారన్నారు. జిల్లాలో 3 సంవత్సరాల 7 నెలల పాటు సేవలందించారని వివరించారు. నూతన బాధ్యతల నిర్వహణలో కూడా ఇదే స్ఫూర్తితో పేరు ప్రఖ్యాతులు పొందాలని కోరారు. అశోక్‌బాబు మాట్లాడుతూ జిల్లా పోలీసు కుటుంబం మరిచిపోలేని అనుభవాలను అందించిందని, పోలీసు అధికారులు, సిబ్బంది చూపించిన ప్రేమ, మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్‌ డీఎస్పీ రమణకుమార్‌, ఏఆర్‌ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పీఎస్‌ సీఐ సుధాకర్‌, వన్‌టౌన్‌ సీఐ నాగరాజు, టూటౌన్‌ సీఐ మేడా శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, సీసీఎస్‌ సీఐ జగదీష్‌, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌

ఒంగోలు టౌన్‌: బక్రీదు పండుగను ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌ కోరారు. నేడు బక్రీదు పండుగ నేపథ్యంలో శుక్రవారం మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పండుగ నమాజు సమయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద డ్రోన్స్‌, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్‌ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మత సామరస్యానికి ఎలాంటి విఘాతం కలగకుండా బాధ్యతగా ప్రవర్తించాలన్నారు. జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గోవులను అక్రమంగా తరలించినా, గోవధ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ నిరోధించడానికి జిల్లా నోడల్‌ అధికారిగా అడిషనల్‌ ఎస్పీ (అడ్మిన్‌) కె.నాగేశ్వరరావును నియమించినట్లు తెలిపారు. సోషల్‌ మీడియాలో మత విద్వేషాలు, సంఘర్షణలను రేకెత్తించే పోస్టులు పెట్టరాదన్నారు. మత ఘర్షణలను ప్రేరేపించే పుకార్లను నమ్మవద్దన్నారు. అపోహలు, వదంతులను నమ్మవద్దన్నారు. అందరూ మత సామరస్యంతో బక్రీదు పండుగ చేసుకోవాలని సూచించారు. గోవధ, పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు కంట్రోలు రూంకు తెలియజేయాలని, 9121102266 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉమ్మీద్‌ యాప్‌తో న్యాయస్థానాలకు అగౌరవం

ఒంగోలు టౌన్‌: ఒకవైపు న్యాయస్థానాలలో వక్ఫ్‌ సవరణ చట్టం మీద వాదనలు జరుగుతుంటే మరో వైపు ఉమ్మీద్‌ యాప్‌ను ప్రారంభించడం న్యాయస్థానాలను అగౌరవపరచడమేనని సోషల్‌ డెమోక్రటిక్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్‌ సత్తార్‌ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బిలాల్‌ మసీదు కమ్యూనిటీ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తార్‌ మాట్లాడుతూ సుప్రీం తీర్పు వచ్చేంత వరకు వక్ఫ్‌ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో ఉమ్మీద్‌ యాప్‌ను అమలు చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అల్లాభక్షు, ఖాదర్‌బాషా, గని, షఫీ, బాజీ షమీమ్‌ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సత్యనారాయణ

సంతనూతలపాడు: వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులోని గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథపాలకుడు కే సత్యనారాయణ, మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్‌ ఏ.కరుణాకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి వర్ధంతి సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కొత్తపట్నం: స్థానిక బస్టాండ్‌ సెంటర్‌లోని కళామందిర్‌లో ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా సభ్యురాలు కె.రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించగా, రమాదేవి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో సమాజంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సీపీఎం పార్టీ పనిచేస్తోందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను లూటీ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టి ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ రంగాన్ని కార్పొరేటు కంపెనీలకు కారుచౌకగా అప్పగిస్తోందన్నారు. ఫలితంగా సంపద కొద్దిమంది చేతుల్లోకి చేరిందన్నారు. నిరుద్యోగం పెరిగి చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. కార్పొరేటర్ల ప్రయోజనాల కోసం వ్యవసాయ రంగ ప్రయోజనాలను బలితీస్తున్నారని దుయ్యబట్టారు. సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాబట్టాలన్నారు. కానీ, మెతక వైఖరి అవలంబిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వ ఒత్తిడికి లొంగి ప్రజలపై విద్యుత్‌, ఇంటి పన్ను భారాలు మోపుతోందన్నారు. వెనకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలని సీపీఎం పోరాడుతోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పి.చలపతి, వి.యానాది, పి.శ్రీను, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీవారి ఊంజల్‌ సేవ



శ్రీవారికి మేల్చాట్‌ వస్త్రాలు సమర్పిస్తున్న బొల్లాపల్లి సుబ్రహ్మణ్యం దంపతులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలతో ఒంగోలు నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న భక్తులతో శ్రీగిరి మరో దివ్య తిరుమల క్షేత్రంగా భాసిల్లుతూ ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి అభిషేకంతో పాటు విశేష స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఒంగోలుకు చెందిన బొల్లాపల్లి సుబ్రహ్మణ్య హనుమత్‌ కిషోర్‌, వెంకటఫణిదీప్తి దంపతులు శ్రీవారికి మేల్చాట్‌ వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ శోభాయమానంగా జరిగింది. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్‌ వినోద్‌ కుమార్‌ పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి భక్తులకు ఆధ్యాత్మిక రసానందాన్ని పంచిపెట్టారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్‌ ఆలూరు శ్రీనివాసచరణ రాజీవ్‌, ఆలూరు జై శంకర్‌ తదితరులు పాల్గొని గాయకుడు వినోద్‌ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న వినోద్‌ కుమార్‌ బృందం

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే బూచేపల్లి పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బూచేపల్లి

దర్శి (కురిచేడు): దర్శి మండలం ఎర్ర ఓబనపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల ప్రతిష్ఠ కార్యక్రమాల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం ఆయన శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలపై ఆది దేవుని, ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు మెండుగా ఉండాలని ప్రార్థించారు. ఆయన వెంట దర్శి, ముండ్లమూరు పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, పేరం రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే తాటిపర్తి



క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్ట్‌ చర్చిని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని పాత అన్నసముద్రంలో నూతనంగ నిర్మించిన బాప్టిస్ట్‌ చర్చి ప్రారంభోత్సవం క్రైస్తవ ప్రార్థనల మధ్య వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. చర్చి ప్రారంభోత్సం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవులు కలిసి మెలిసి ప్రేమ దయతో ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ఎస్‌. పోలిరెడ్డి, నాయకులు పి.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, శార, సరళ, రంగబాబు, గాలెయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి